ముగిసిన పవిత్రోత్సవాలు



విశేష అలంకరణలో పద్మావతి అమ్మవారు, చక్రత్తాళ్వార్



చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

టీనగర్, న్యూస్‌టుడే: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలోని టీనగర్ జీఎన్ శెట్టి రోడ్‌శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయ పవిత్రోత్సవాలు ఘనంగా ముగిశాయి. 14న అంకురార్పణతో వేడుకలు ప్రారంభమయ్యాయి. చివరిరోజైన గురువారం ఉదయం చక్రస్నానం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అమ్మవారితో పాటు చక్రత్తాళ్వార్‌కు అర్చకులు పూజలు చేశారు. ఆ తర్వాత పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహించారు. అర్చకులు, తితిదే తమిళనాడు విభాగ ఏఈఓ పార్థసారధి, పద్మావతి అమ్మవారి ఆలయ సూపరింటెండెంట్ పుష్పలత, భక్తులు పలువురు పాల్గొన్నారు. సాయంత్రం తిరుచ్చి ఉత్సవంలో భాగంగా అమ్మవారిని మాడ వీధుల్లో ఊరేగించారు. అనంతరం పార్థసారధి, పుష్పలత మాట్లాడుతూ పవిత్రోత్సవాల్లో భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. అందరి సహకారంతో వేడుకలు వైభవంగా నిర్వహించామని చెప్పారు.

రాష్ట్ర మహిళా కాంగ్రెస్ కమిటీలు రద్దు

చెన్నై, న్యూస్‌టుడే: ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ నాయకత్వం ఆదేశాలు మేరకు తమిళనాడు మహిళా కాంగ్రెస్‌లోని అన్ని కమిటీలను రద్దు చేస్తున్నట్లు అధ్యక్షురాలు సయ్యద్ హసీనా వెల్లడించారు. ఆమె తన ప్రకటనలో.. తమిళనాడు మహిళా కాంగ్రెస్‌లో రాష్ట్ర, జిల్లా, తాలూకా, బ్లాక్, పంచాయతీ, బూత్ కమిటీలను రద్దు చేస్తున్నట్లు తెలిపారు. కొత్త కమిటీలను త్వరలో ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు.

అంచనాలు తారుమారు!

- చినుకులు రాల్చకుండా మాయమైన 'రెడ్ అలర్ట్'
- వాతావరణశాఖ హెచ్చరికలపై విమర్శలు
- వర్షాలు లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్న చెన్నైవాసులు

చెన్నై నగరానికి వాతావరణశాఖ ఇచ్చిన వర్ష సూచనలు తారుమారయ్యాయి. 15న అతిభారీ వర్షాల వరకే 'ఆరెంజ్' అలర్ట్ ఇచ్చినా.. అదేరోజు ఉదయం ఉన్నఫళంగా అది అత్యంత భారీ వర్షాలు సూచించే 'రెడ్ అలర్ట్'గా మార్చారు. 16న అత్యంత భారీ వర్షాలొస్తాయని 'రెడ్ అలర్ట్' ఇచ్చినా.. కనీసం నగరంలో చాలాచోట్ల వర్షాలే నమోదవలేదు. ఈ తరహా వాతావరణ హెచ్చరికలతో నగరవాసులు గందరగోళానికి గురవుతున్నారు.

ఈనాడు-చెన్నై

వాయుగుండం బలహీనపడి తీవ్ర అల్పపీడనంగా.. చెన్నైకు ఉత్తరంవైపుగా గురువారం తెల్లవారుజామున 4.30 గంటల ప్రాంతంలో తీరం దాటినట్లు ప్రకటించారు. ఆ తర్వాత అది ఆంధ్రప్రదేశ్ మీదుగా ప్రయాణించింది. తీరానికి దగ్గరగా వచ్చిన సమయంలో ఎలాంటి వర్షాలు కురవకుండా దాటేయడమే అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. మరోవైపు అదితీరం దాటగానే.. చెన్నైలో ఎండసైతం కనిపించడం మరో ఆశ్చర్యానికి గురిచేసింది. ఇవన్నీ వాతావరణశాఖ అంచనాలకు భిన్నంగా జరిగాయి.

అంతా ప్రశాంతం..

వాతావరణ అంచనాలు తప్పాయి. గురువారం చెన్నైలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ ప్రకటించింది. చెన్నైతో పాటు కొన్ని జిల్లాల్ని అప్రమత్తం చేశారు. బుధవారం సీన్ మారడంతో గురువారం సైతం నగరంలో అలాంటి పరిస్థితులే తారసపడ్డాయి. ఎక్కడా చుక్క వర్షం లేకుండానే రోజు గడవటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. వాతావరణశాఖ అంచనాలకు భిన్నంగానే ఇవన్నీ జరగడం ఆశ్చర్యానికి గురిచేసింది. బుధవారం గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పరిధిలో కేవలం కొన్నిచోట్ల మాత్రమే మోస్తరు వర్షాలు కురిశాయి. మణలి, తిరువొత్తియూర్‌లో 3 సెం.మీ., కత్తివాక్కం, తండియార్‌పేటలో 2 సెం.మీ., చెన్నై కలెక్టరేట్, రాయపురం, పెరంబూర్, అయనావరంలో సెం.మీ. మాత్రమే నమోదైంది. 16న మధ్యాహ్నం నుంచి ఎక్కడా వర్షమే లేదు.

విమర్శలు వచ్చినా వాతావరణ శాఖ హెచ్చరికల్ని గౌరవించాల్సిందేనని వాతావరణ నిపుణుడు ప్రదీప్ జాన్ తెలిపారు. కొన్ని సందర్భాల్లో భారీవర్షాలు పడతాయనే సూచన వచ్చినా తర్వాత పరిస్థితులు మారాయని పేర్కొన్నారు. 16న అత్యంత భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ ప్రకటనతో తాను ఏకీభవించలేదన్నట్లు తెలిపారు. మనుషులు తమకున్న సాంకేతికత పరిజ్ఞానంతో ఊహించి అంచనాలు మాత్రమే వేయగలరని, కొన్ని మోడల్స్ ఆధారంగా వాతావరణ సూచనలు ఉంటాయన్నారు. తాను కూడా తనకున్న సామర్థ్యం మేరకు మాత్రమే వాతావరణ సూచనలు చెబుతూ వస్తున్నట్లు స్పష్టం చేశారు. ఆయన అంచనాల ప్రకారం.. 15, 16 తేదీల్లో 20 సెం.మీ. వర్షపాతం దాటిన ప్రాంతాలు 75 వరకు ఉన్నాయని.. ఇవన్నీ కూడా 24గంటల్లో ఇంతటి వర్షపాతాన్ని నమోదుచేశాయని వివరించారు.



16న మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో చెన్నైతో పాటు తిరువళ్లూరు, చెంగల్పట్టు, కాంచీపురం జిల్లాలకు రెడ్ అలర్ట్ ఇచ్చిన వాతావరణశాఖ



16న రాత్రి 8.30 సమయంలో హెచ్చరికల్ని మార్చింది. చెన్నైతోపాటు రెడ్ అలర్ట్ ప్రకటించిన జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ఇచ్చారు. అర్ధరాత్రికి వాటిని కూడా ఉపసంహరించుకున్నారు.

చెరువుల్లోకి భారీగా నీరు..

15, 16 తేదీల్లో రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలతో రాష్ట్ర వ్యాప్తంగా 891 చెరువులు జలాలతో కళకళలాడుతున్నట్లు అధికారులు నివేదిక ఇచ్చారు. ఇందులో ప్రధానంగా కన్నియాకుమరిలో 310, మదురైలో 244 చెరువులున్నాయని పేర్కొన్నారు. ఉత్తర తమిళనాడు తీర జిల్లాలు, డెల్టా జిల్లాలో 180 చెరువుల్లోకి భారీగా నీళ్లు చేరాయని చెబుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 14,139 చెరువులుంటే అందులో 1,832 చెరువుల్లో 75శాతం, 2,096 చెరువుల్లో 50 శాతానికి మించి నీరొచ్చిందని వెల్లడించారు. కోయంబత్తూరు, దిండుక్కల్ ఈరోడ్ జిల్లాల్లోని పలు రిజర్వాయర్లకు నీరు బాగా చేరిందన్నారు.

14.8 లక్షల మంది వర్ష బాధితులకు ఆహారం: ప్రభుత్వం

చెన్నై, న్యూస్‌టుడే: భారీవర్షాల నేపథ్యంలో 14.8 లక్షల మంది వర్ష బాధితులకు ఉచితంగా ఆహారం అందించినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటనలో వెల్లడించింది. భారీ వర్షంతో ఉపాధి, ఆదాయం లేక ప్రజలు ఇబ్బంది పడుతున్న దృష్ట్యా నగరంలోని అమ్మ క్యాంటీన్లలో 16, 17 తేదీల్లో ఉచితంగా ఆహారం అందించాలని ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశించారు. ఆ మేరకు బుధవారం ఉదయం ఇడ్లీ, పొంగల్, మధ్యాహ్నం మిక్స్‌డ్ రైస్ ఆహారం, సాయంత్రం చపాతి అందించారు. వాటి ద్వారా ఉదయం, మధ్యాహ్నం 78,567 మంది, సాయంత్రం 29,316 మంది లబ్ధిపొందారు. ముఖ్యమంత్రి పుళియంతోపు ప్రాంతాన్ని పరిశీలించి అక్కడ మహానగర చెన్నై కార్పొరేషన్ ఫ్రంట్‌లైన్ సిబ్బంది, శుభ్రతా సిబ్బంది చేపట్టిన పనులను పర్యవేక్షించి వారిని ప్రోత్సహించారు. కురిసిన భారీవర్షానికి మహానగర చెన్నై కార్పొరేషన్‌లో 542 ప్రాంతాల్లో నీరు చేరుతుండటంతో అప్పటికే సిద్ధంగా ఉంచిన మోటారు పంపుల ద్వారా తొలగించారు. లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను నగరంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 300 సహాయక శిబిరాలకు సురక్షితంగా తరలించి ఆహారం, దుస్తులు, తాగునీరువంటివి అందించారు. రెండు రోజుల్లో 14,84,735 మందికి ఆహారం అందించారు. చెన్నై కార్పొరేషన్‌లో 304 వర్షాకాల వైద్య శిబిరాలు నిర్వహించి 17,471 మంది వైద్య సహాయాలు అందించారు. నగరంలోని 22 సబ్-వేలలో వర్షపునీటిని తొలగించి ట్రాఫిక్ క్రమబద్ధీకరించారని ప్రభుత్వం ప్రకటనలో పేర్కొంది.

నేడు ఏఐఎల్ఆర్ఎస్ఏ సభ్యుల ఆందోళన

వడపళని, న్యూస్‌టుడే: ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్(ఏఐఎల్ఆర్ఎస్ఏ) సభ్యులు మూర్ మార్కెట్ కాంప్లెక్సు(ఎంఎంసీ) వద్ద శుక్రవారం ఉదయం 11 గంటలకు ఆందోళన చేయనున్నారు. భద్రత దృష్ట్యా 365 రోజుల పని విధానంలో మార్పులు కావాలని, గూడ్సు రైళ్లలో పని చేసే వారికి 12 నుంచి 8 గంటలు, ప్రయాణికుల రైళ్లను నడిపే వారికి 12 నుంచి 6 గంటల పని విధానాన్ని అమలు చేయాలని, ప్రస్తుతం వారంలో నాలుగు రోజులున్న రాత్రి పని వేళలను రెండు రాత్రులకు కుదించాలని డిమాండ్ చేశారు. వాటిని నెరవేర్చాలని ఆందోళన చేపడుతున్నట్లు సంఘం నిర్వాహక కార్యదర్శి వి.బాలచంద్రన్, సహ జోనల్ కార్యదర్శి కె.పార్థసారధి గురువారం ప్రకటన విడుదల చేశారు.

వరద నివారణ చర్యలు భేష్: సెల్వ పెరుంతగై

చెన్నై, న్యూస్‌టుడే: ప్రతిపక్షం విమర్శించలేని స్థాయిలో వరద నివారణ చర్యలను ప్రభుత్వం చేపట్టిందని టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వ పెరుంతగై తెలిపారు. ఆయన తన ప్రకటనలో... చెన్నై, తిరువళ్లూర్, కాంచీపురం, ఉత్తర జిల్లాల్లో భారీవర్షాలు కురిశాయన్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశాల మేరకు రెవెన్యూ, ప్రజాపనులు, ఇతర శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో ముమ్మరంగా పనులు చేపట్టడంతో ఎలాంటి నష్టం వాటిల్లలేదని, ఇది రాష్ట్ర ప్రభుత్వ విజయంగా భావించవచ్చని పేర్కొన్నారు. వాననీటి తొలగింపుతో గురువారమే సాధారణ పరిస్థితి నెలకొందన్నారు. గవర్నర్ ఆర్.ఎన్.రవి ప్రభుత్వ సహాయక చర్యలను అభినందించడం గమనార్హమన్నారు.

నట్లు, బోల్టులు మాయమయ్యాయి!

- కవరైపెట్టై రైలు ప్రమాదంపై రైల్వే ప్రాథమిక నివేదిక
- కుట్రకోణాన్ని తీసివేయలేమన్న అధికారులు



ఈనాడు-చెన్నై: ఆంధ్రప్రదేశ్ సరిహద్దు తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లా కవరైపెట్టై స్టేషన్ వద్ద ఈనెల 11న రాత్రి జరిగిన రైలు ప్రమాదంలో కీలక విషయాలు వెల్లడిస్తూ రైల్వే అధికారులు తాజాగా 16 పేజీల నివేదిక సమర్పించారు. వివిధ విభాగాలకు చెందిన ఏడుగురు ఉన్నతస్థాయి అధికారులు ఘటనాస్థలాన్ని పరిశీలించిన తర్వాత.. ఒక విషయంలో ఏకాభిప్రాయానికి వచ్చినట్లు కనిపిస్తోంది. భాగమతి ఎక్స్‌ప్రెస్ మెయిన్‌లైన్ నుంచి లూప్ లైన్‌లోకి మారేందుకు ఏదైనా కుట్ర జరిగిందనే విషయాన్ని తీసివేయలేమని చెబుతున్నారు. ప్రధానంగా లూప్‌లైన్‌కు వెళ్లేలా చేయడంలో భాగంగా పట్టాలకు చెందిన నట్లు, బోల్టులు మాయమయ్యాయని.. ప్రమాదానికి ఇది కూడా కారణమై ఉండొచ్చని వివరించారు.

ప్రమాదానికి అసాధారణ కారణం

ఘటనకు అసలు కారణంపై అధికారిక బృందం తుది నిర్ణయానికి మాత్రం రాలేదు. ప్రధానంగా రైల్వేకోచ్‌లు దెబ్బతిన్న తీరు, రైల్వేకు జరిగిన నష్టంపై దృష్టి కేంద్రీకరించినట్లుగా తెలుస్తోంది. భాగమతి ఎక్స్‌ప్రెస్ లూప్‌లైన్‌లోకి వెళ్లడానికి స్పష్టమైన కారణం చెప్పకపోగా, కచ్చితమైన రుజువుల్ని వెల్లడిచేయనట్లు తెలుస్తోంది. చెన్నైలోని ఉన్నతాధికారులు సైతం.. రైలు మెయిన్‌లైన్ నుంచి లూప్‌లైన్‌లోకి వెళ్లడానికి అసాధారణ విషయాలే కారణమై ఉండొచ్చనే అభిప్రాయాన్ని వెల్లడిస్తున్నారు. కమిషన్ ఆఫ్ రైల్వే సేఫ్టీ అధికారులు ప్రస్తుతం దర్యాప్తు జరుపుతున్న నేపథ్యంలో అందులో సమగ్ర వివరాలు బయటపడొచ్చని చెబుతున్నారు. ఈ ఘటనపై కుట్ర కోణంలో ఎన్ఐఏ సైతం దర్యాప్తు చేస్తోంది. ప్రమాదం ఈనెల 11న రాత్రి జరగ్గా 14న పోలీసు కేసు నమోదు చేశారు.

పట్టాలపై సుత్తిగుర్తులు..

నివేదికలోని అంశాలకు సంబంధించి విశ్వసనీయవర్గాల సమాచారం ప్రకారం.. కరవైపెట్టై స్టేషన్‌కు చేరుకునే క్రమంలో భాగమతి ఎక్స్‌ప్రెస్ గంటకు 90 కి.మీ. వేగంగా వచ్చిందని, అదే సమయంలో మెయిన్‌లైన్‌లో గ్రీన్ సిగ్నల్ ఉండగా లూప్‌లైన్‌లోకి వెళ్లి అక్కడ ఆగి ఉన్న ఖాళీ గూడ్స్‌రైలును ఢీకొందని తెలిపారు. 13 కోచ్‌లు పట్టాలు తప్పిపోగా, కొన్ని చెల్లాచెదురుగా పడ్డాయని, ఈ ఘటనలో పలువురికి గాయాలయ్యాయని వివరించారు. ఈ ఘటన తీవ్రతతోనూ పార్శిల్ కమ్ పవర్‌కార్ నుంచి మంటలు చెలరేగాయని తెలిపారు. పరిశీలనలో పట్టాలపై సుత్తి గుర్తులున్నట్లు గమనించారని పేర్కొంటున్నారు. అక్కడ కొన్ని బోల్టులు లూజ్ అయి ఉండగా, మరికొన్ని కనిపించలేదని అభిప్రాయపడ్డారు. మాయమైన బోల్టులు, నట్లు గురించి వెతికినట్లు, దొరకలేదనిగానీ స్పష్టత ఇవ్వలేదు.

కొళత్తూర్‌లో సంక్షేమ సహాయాలు అందజేత





శుభ్రతా కార్మికులతో కలిసి భోజనం చేస్తున్న ముఖ్యమంత్రి ● దివ్యాంగ చిన్నారులకు సాయమందిస్తూ..



వాననీటి తొలగింపు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, న్యూస్‌టుడే: భారీ వర్షాలకు దెబ్బతిన్న కొళత్తూర్ శాసనసభ నియోజకవర్గంలోని ప్రాంతాల్లో ముఖ్యమంత్రి స్టాలిన్ గురువారం పర్యటించారు. వీనస్‌నగర్‌లో ఏర్పాటు చేసిన వర్షపునీటి తొలగింపు కేంద్రంలో జరుగుతున్న పనులు, రెట్టేరి అభివృద్ధి పనులు పరిశీలించారు. బాలాజీనగర్‌లో జరుగుతున్న వైద్య శిబిరాన్ని పరిశీలించి ప్రజలకు అందిస్తున్న చికిత్సలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు రొట్టె, కోడిగుడ్డు, పాలు వంటివి అందించారు. అయనావరం, మాధవరం తాలూకాలోని తణికాచలం నగర్ మిగులు జలాల కాలువలో రూ.91.36 కోట్లతో జరుగుతున్న పనులు పరిశీలించారు. పెరియార్‌నగర్ కార్తికేయన్ రోడ్డులోని తిరువళ్లువర్ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో చెంబియంలోని రాఘవావీధిలో కొనసాగుతున్న సీఎస్ఐ ప్రత్యేక పాఠశాలకు చెందిన 70 మంది దివ్యాంగ చిన్నారుల సంక్షేమార్థం దృష్ట్యా 2 జతల పాదరక్షలు, ప్రింటర్, 2 ఇనుప బీరువాలను ఆ పాఠశాల కరస్పాండెంట్ ఎడ్విన్ రాజ్‌కుమార్‌కు అందించారు. జంబులింగం మెయిన్ రోడ్డులోని కామరాజర్‌సత్రంలో 600 మంది శుభ్రతా కార్మికులకు బియ్యం, వానకోటు, చీరలు, దుప్పట్లు, రస్క్, పాల పిండి, కందిపప్పు, కారంపొడి, వంటనూనె, లుంగీవంటి 10 వస్తువులు చొప్పున అందించారు. శుభ్రతా కార్మికులకు మధ్యాహ్న భోజనంగా బిర్యానీ వడ్డించి వారితో కలిసి ఆరగించారు. వెంట మంత్రులు కేఎన్ నెహ్రూ, పీకే శేఖర్‌బాబు, మహానగర చెన్నై కార్పొరేషన్ మేయర్ ప్రియ, ఎంపీలు కళానిధి వీరాసామి, గిరిరాజన్, ఎమ్మెల్యే సుదర్శనం, మహానగర చెన్నై కార్పొరేషన్ కమిషనరు కుమరగురుభరన్, మెట్రోవాటర్ బోర్డు ఎండీ వినయ్ తదితరులు ఉన్నారు.

మరమ్మతు పనుల్లో విద్యుత్తుశాఖ

న్యూస్‌టుడే, వడపళని



తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు సరిచేస్తున్న సిబ్బంది

రాష్ట్రంలో మరి కొద్ది రోజుల్లో ఈశాన్య రుతుపవనాలు ప్రారంభం కానుండటంతో తమిళనాడు పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీఎన్‌పీడీసీఎల్) ఒరిగిన విద్యుత్తు స్తంభాలు సరిచేయడం లేదా మార్చడం, జంక్షన్ బాక్సులు, విద్యుత్తు తీగలను బలపరచడం, అవసరమైన చోట్ల భూగర్భంలో కేబుళ్లు ఏర్పాటు చేయడం వంటి పనులు ప్రారంభించింది. నగర వ్యాప్తంగా వాననీటి సంరక్షణకు పనులు జరుగుతున్నాయి. అక్కడ కూడా ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలున్న చోట నగరం, శివారు ప్రాంతాల్లో కూడా పనులు జరిగాయి.

పిల్లర్ బాక్సుల ఎత్తు పెంపు

ముఖ్యమంత్రి స్టాలిన్ నియోజకవర్గమైన కొళత్తూరులో నిర్వహణ పనులు పూర్తయ్యాయి. పెరంబూరు, తిరువొత్తియూరు ప్రాంతాల్లో పనులు జరుగుతున్నాయి. దసరా అనంతరం రాయపురం, ఆర్కేనగర్ ప్రాంతాల్లో పనులు చేపట్టనున్నట్టు చెన్నై నార్త్ డివిజన్ సూపరింటెండెంట్ ఇంజినీరు అన్నారు. వరదల్లో చిక్కుకోకుండా ఉత్తర చెన్నైలో 1,804 పిల్లర్ బాక్సులను ఎత్తు పెంచనున్నారు. నగరం పశ్చిమ ప్రాంతం, అరుంబాక్కంలో ప్రస్తుతం బాక్సులు ఎత్తుగా ఉంచే పనుల్లో సిబ్బంది నిమగ్నమయ్యారు. దాదాపు 90శాతం పనులు పూర్తయ్యాయని అధికారులన్నారు. గత ఏడాది వరదలతో ఇబ్బందులెదుర్కొన్న దక్షిణ చెన్నైలోని గిండీలాంటి ప్రాంతాల్లో 108 పిల్లర్ బాక్సులు ఏర్పాటు చేయనున్నారు. ఈ పనులు వచ్చేవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఆ విభాగ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. అదేవిధంగా ఈసీఆర్ రోడ్డు, కొట్టివాక్కం ప్రాంతాల్లో కూడా బాక్సుల ఎత్తు పెంచే పనులు జరగనున్నాయి.

● కాంట్రాక్టర్లతో కలిసి.. వాననీటి కాలువల పనులు జరిగే సమయంలో అక్కడ కూడా విద్యుత్తు తీగలు బాగా దెబ్బతిన్నాయని, అలాంటి చోట్ల పనుల కోసం కాంట్రాక్టర్లతో కలిసి పనులు చేస్తున్నట్లు టీఎన్‌పీడీసీఎల్ సీనియర్ అధికారి ఒకరన్నారు. కొన్ని చోట్ల టీఎన్‌పీడీసీఎల్‌కు చెందిన సొంత కాంట్రాక్టర్లకే కేబుళ్ల ఏర్పాటు చేసే పనులు అప్పగించినట్టు ఆయన చెప్పారు.

గతేడాదిలా కాకుండా..

గత ఏడాది డిసెంబరులో సంభవించిన వరదలను దృష్టిలో ఉంచుకుని ముందుగానే టీఎన్‌పీడీసీఎల్ జాగ్రత్తలు తీసుకుంటోంది. గత ఏడాది వరదల సమయంలో పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం వాటిల్లింది. కొన్ని ప్రాంతాలు రోజుల తరబడి అంధకారంలో ఉన్నాయి. విద్యుత్తుశాఖ క్షేత్ర స్థాయిలో రేయింబవళ్లు మరమ్మతులు చేసి సరఫరాను పునరుద్ధరించింది. ఈ క్రమంలో విద్యుత్తుశాఖ మంత్రి సెంథిల్ బాలాజీ ఇటీవల అధికారులతో దీనిపై సమావేశం జరిపారు. వర్షాలు ప్రారంభమయ్యేలోగా నగరం, శివారు ప్రాంతాల్లో చేపట్టాల్సిన మరమ్మతులు, ఇతర పనులపై టీఎన్‌పీడీసీఎల్ విభాగం దృష్టి సారించాలని అధికారులకు ఆదేశించారు.

గ్యాస్ సిలిండర్‌తో విచారణకు హాజరైన వ్యాపారి



సిలిండర్‌తో కోర్టుకు వస్తున్న నిర్మల్


రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: కోవై ఆర్ఎస్‌పురానికి చెందిన నిర్మల్ కోడి మాంసం దుకాణం నిర్వహిస్తున్నాడు. 2023లో వంటగ్యాస్ సిలిండర్ కొనుగోలు చేశాడు. సిలిండర్ బరువు 30.1 కిలోల బరువు ఉండాలి. కొనుగోలు చేసిన సిలిండర్ బరువు 27.7 కిలోలు మాత్రం ఉండటంతో కోవై జిల్లా వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేశాడు. ఈ కేసు గురువారం విచారణకు వచ్చింది. నిర్మల్ సిలిండర్‌తో పాటు కోర్టుకు రావడంతో అందరూ ఆసక్తిగా చూశారు.

కన్నదాసన్ కలకాలం గుర్తుండిపోతారు: అన్నామలై

సైదాపేట, న్యూస్‌టుడే: ప్రముఖ కవి కన్నదాసన్ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం భాజపా రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై నివాళులు తెలియజేశారు. ఆయన విడుదల చేసిన ప్రకటనలో.. ఆయన రచనలు అన్ని పరిస్థితులకు సరిపోయేలా ఉంటాయని, అందరి మనస్సుల్లో కలకాలం జీవించి ఉంటారన్నారు. కన్నదాసన్ రాసిన అర్థముల్ల హిందూ మతం, యేసు కావ్యం తదితర పుస్తకాలు ఆయనలోని లోతైన దైవభక్తిని తెలియజేస్తాయన్నారు. 4 వేలకుపైగా కవితలు, 5 వేలకుపైగా సినీ గేయాలు, అనేక వ్యాసాలు, చిన్నకథలు రాశారని గుర్తు చేశారు. పలు అవార్డులు ఆయన్ను వరించాయని తెలిపారు.

అసంపూర్తిగా వాననీటి కాలువ పనులు

- ఓపీఎస్ విడిపోలేదు.. పార్టీ నుంచి తొలగించాం
- ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిసామి
- ఘనంగా అన్నాడీఎంకే వార్షికోత్సవం







ఎంజీఆర్, జయలలిత విగ్రహాలకు మాలవేసి నివాళుర్పిస్తున్న ఎడప్పాడి పళనిసామి, అన్నదానం చేస్తూ..

సైదాపేట, న్యూస్‌టుడే: వాననీటి పారుదల కాలువ పనులు డీఎంకే ప్రభుత్వం సక్రమంగా చేయలేదని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, ప్రతిపక్షనేత ఎడప్పాడి పళనిసామి ఆరోపించారు. అన్నాడీఎంకే 53వ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. చెన్నై రాయపేటలోని ప్రధాన కార్యాలయంలో ఎంజీఆర్, జయలలిత విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జెండా ఎగురవేసి నిర్వాహకులు, కార్యకర్తలు, ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. పార్టీ సంస్థాగత కార్యదర్శి ఆదిరాజారామ్ ఆధ్వర్యంలో కార్యాలయం ఎదుట అన్నదానం చేశారు. పలు సంక్షేమ సహాయాలు అందించారు. మేళతాళాలతో ఈపీఎస్‌కు స్వాగతం పలికారు. అనంతరం ఎడప్పాడి పళనిసామి విలేకర్లతో మాట్లాడుతూ.. తక్కువ వర్షానికే చెన్నై అల్లాడిపోయే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. రాయపురం తదితర పలుచోట్ల వాననీరు నిలిచిందన్నారు. 20సెం.మీ. వర్షం కురిసినా నీరు నిలవదని ముఖ్యమంత్రి, మంత్రులు చెబుతున్నారని, 1,840 కి.మీ. దూరానికి వాననీటి కాలువల పని అన్నాడీఎంకే ప్రభుత్వంలో జరిగిందన్నారు. మిగిలిన పనులను డీఎంకే ప్రభుత్వం పూర్తి చేయలేదని విమర్శించారు. తిరుప్పుగళ్ కమిటీ నివేదికపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అన్నాడీఎంకే పాలనలో ఆయా శాఖల పనులను మంత్రులు చూసుకున్నారని, ప్రస్తుతం అన్ని శాఖలను ఉప ముఖ్యమంత్రే చూస్తున్నారని ఎద్దేవా చేశారు.

సమన్వయం.. అర్థరహితం

అన్నాడీఎంకే నుంచి తొలగించినవారి సంగతి ఇక అంతేనని ఈపీఎస్ తెలిపారు. పార్టీ పలు వర్గాలుగా విడిపోయిందని చెప్పడంలో అర్థం లేదన్నారు. ఓపీఎస్ సహా వారంతా పార్టీ నుంచి విడిపోలేదని, తొలగించామని స్పష్టం చేశారు. అన్నాడీఎంకే వర్గాల సమన్వయం అని చెప్పటంలో అర్థం లేదన్నారు. అన్నాడీఎంకే ఒకటిగా ఉండటంతోనే ఈరోజు ఇంతమంది ఇక్కడున్నారని పేర్కొన్నారు.

21న ఆందోళన..

కల్పాక్కం అసెంబ్లీ నియోజకవర్గంలోని అటవీప్రాంతంలో కొత్తగా వేసిన రోడ్లను పాడు చేసిన అటవీశాఖను తీరును ఈపీఎస్ ఖండించారు. ముఖ్యమంత్రి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ 21న తిరువణ్ణామలై జిల్లా అన్నాడీఎంకే తరపున జమునామరత్తూరు బస్టాండు వద్ద ఆందోళన నిర్వహించనున్నట్లు ప్రకటనలో తెలిపారు.

చెన్నై విమానాశ్రయానికి బాంబు బెదిరింపులు

- ఇద్దరు పాఠశాల విద్యార్థులు అరెస్టు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: చెన్నై విమానాశ్రయంలో బాంబు పెట్టినట్లు బుధవారం విమానాశ్రయ అధికారులకు ఫోన్ కాల్ వచ్చింది. అప్రమత్తమైన అధికారులు వెంటనే బాంబు స్క్వాడ్‌కు సమాచారం ఇచ్చారు. జాగిలాల సాయంతో విమానాశ్రయం మొత్తం క్షుణ్నంగా తనిఖీ చేశారు. పేలుడు వస్తువులు లభించలేదు. విమానాశ్రయ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సెల్ నెంబరు ఆధారంగా ఇద్దరు పాఠశాల విద్యార్థులు బెదిరింపులకు పాల్పడినట్లు గుర్తించారు. వారిని అరెస్టు చేసి దర్యాప్తు చేశారు. సరదాకి అలా చేశామని, క్షమించమని కోరడంతో హెచ్చరించి పంపించేశారు.

ఘనంగా అన్నామలై వర్సిటీ స్నాతకోత్సవం

వేళచ్చేరి, న్యూస్‌టుడే: కడలూర్ జిల్లా చిదంబరంలోని అన్నామలై విశ్వవిద్యాలయంలో గురువారం 86వ స్నాతకోత్సవం ఘనంగా జరిగింది. వర్సిటీ ప్రాంగణంలోని శాస్త్రి హాల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి కులపతి, రాష్ట్ర గవర్నర్ ఆర్‌ఎన్ రవి హాజరై 38,975 మంది విద్యార్థులకు పతకాలు, పట్టాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉన్నత విద్యాశాఖ మంత్రి కోవి.చెళియన్, డాక్టర్ సౌమ్య స్వామినాథన్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న గవర్నర్ ఆర్‌ఎన్ రవి

పంజాబ్ ముఖ్యమంత్రికి జన్మదిన శుభాకాంక్షలు

చెన్నై, న్యూస్‌టుడే: పంజాబ్ సీఎం భగవంత్ మాన్ జన్మదినం సందర్భంగా ఆయనకు ముఖ్యమంత్రి స్టాలిన్ శుభాకాంక్షలు తెలిపారు. తన 'ఎక్స్' పేజీలో.. మంచి ఆరోగ్యం, చేపట్టిన పనులన్నీ విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొంటూ భగవంత్ మాన్‌కు జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు.

జోరుగా బాణసంచా ఉత్పత్తి

☛ పరిశ్రమలకు పెరుగుతున్న ఆర్డర్లు ☛ శివకాశికి తరలివస్తున్న వ్యాపారులు



బాణసంచా తయారు చేస్తున్న దృశ్యం

- న్యూస్‌టుడే, వడపళని

మరి కొద్ది రోజుల్లో దీపావళి పండుగ సమీపిస్తుండటంతో బాణసంచా ఉత్పత్తి సంస్థలు తయారీలో నిమగ్నమయ్యాయి. విరుదునగర్‌లోని బాణసంచా ఉత్పత్తిదారులు ఈ ఏడాది ధరల్లో పెరుగుదల ఉండదని పేర్కొంటున్నారు. ఏటా దేశవ్యాప్తంగా 90 శాతం బాణసంచా విరుదునగర్ నుంచే సరఫరా అవుతోంది. ఇక్కడ 1000 యూనిట్లకు పైగా తయారీ పరిశ్రమలున్నాయి. దీపావళి దగ్గర పడుతున్న కొద్దీ పరిశ్రమల్లో ఉత్పత్తి కూడా ఊపందుకుంది. శివకాశి, సాత్తూరుతోపాటు విరుదునగర్ జిల్లాలోని వేలాది పరిశ్రమలు అమ్మకాలతో సందడిగా కనిపిస్తున్నాయి. 80 శాతం మేరకు ఉత్పత్తి పూర్తయిందని 'ది ఇండియన్ ఫైర్‌వర్క్స్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (టీఐఎఫ్‌ఎంఏ) ప్రధాన కార్యదర్శి టి.కణ్ణన్ అన్నారు. రాష్ట్రంతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి డిమాండు పెరిగిందని, కార్మికుల వేతనాలు, టపాసుల తయారీ కావలసిన ముడి సామగ్రి ధరలు కూడా పెరిగినప్పటికీ వాణిజ్యదారుల నుంచి కొనుగోలు పెరగటంతో ధరలు పెంచకూడదనుకున్నామని కణ్ణన్ చెప్పారు. దీపావళి పండుగ దగ్గరపడటంతో సంస్థలు ఆర్డర్లు తీసుకోవడంలో తలమునకలై ఉన్నాయని పేర్కొన్నారు.

విరివిగా విక్రయాలు

మంచి తగ్గింపు ధర పొందొచ్చనే ఉద్దేశంతో చెన్నై, కోయంబత్తూరు, నామక్కల్, సేలంతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి అనేక మంది విరుదునగర్ జిల్లాకు విచ్చేస్తున్నారు. ఈ ఏడాది చాలా మంది ఆన్‌లైన్‌లో ఆర్డర్లు పంపుతున్నారు. పలు రకాల టపాసుల ధరలు, తగ్గింపు వివరాలను తయారీ సంస్థలు వెబ్‌సైట్‌లో ఉంచాయి. ఆర్డరు అందగానే వారి గుమ్మం వద్దకు పంపుతామని వ్యాపారులు అంటున్నారు. యువత పోప్స్, ఏరియల్ వంటి టపాసులు కొనుక్కోవడానికి సుముఖంగా ఉన్నారని, పిల్లలతో కలిసి పండుగ వేడుకలు చేసుకునే తల్లిదండ్రులు మతాబులు, చిచ్చుబుడ్లు, విష్ణుచక్రాలు, భూచక్రాలు వంటివాటిపై ఆసక్తి చూపిస్తున్నారని తెలిపారు. ఈ ఏడాది అమ్మకాలు బాగానే ఉంటాయని పలువురు వ్యాపారులు గట్టి నమ్మకంతో కనిపిస్తున్నారు.



అసార్టెడ్ గిఫ్ట్ ప్యాక్

ధరలు ఇలా..

మతాబులు రూ.20 నుంచి రూ.400. చిచ్చుబుడ్లు రూ.75 నుంచి రూ.800. విష్ణుచక్రాలు రూ.60 నుంచి రూ.400. ఒకసారి మోత మోగేవి రూ.20 నుంచి 200. బాంబులు రూ.80 నుంచి రూ.300. రాకెట్లు రూ.90 నుంచి రూ.400. ఫ్యాన్సీ ఫైర్‌వర్క్స్ రూ.80 నుంచి రూ.12 వేలుగా ఉన్నాయి. ఫ్యాన్సీ ఏరియల్ ఫైర్‌వర్క్స్‌పై 40 నుంచి 50 శాతం, మతాబులు, చిచ్చుబుడ్లు, చక్రాలపై 30 నుంచి 40 శాతం వరకు తగ్గింపు ఉంది.

పెరిగిన పుళల్ చెరువు నీటిమట్టం

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: భారీ వర్షాల రాక అధికమవడంతో పుళల్ చెరువులో మూడు రోజుల్లో 3 అడుగుల నీటిమట్టం పెరిగింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా తిరువళ్లూరు, చెంగల్పట్టు, కాంచీపురం జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. పోళవరంలో 30 సెం.మీ, రెడ్‌హిల్స్‌లో 28 సెం.మీ వర్షపాతం నమోదైంది. చెన్నైకి తాగునీరు అందించే పూండి, పుళల్, పోళవరం, చెంబరంబాక్కం, కన్నన్‌కోట్టై చెరువులకు భారీగా నీరు చేరింది. పుళల్ చెరువులో 3 రోజుల్లో నీటిమట్టం 3 అడుగులు పెరిగింది. గురువారం 16.90 అడుగులకు చేరింది. చెరువు పూర్తి సామర్థ్యం 21 అడుగులుగా ఉంది. ప్రస్తుతం 2,388 టీఎంసీల నీరు నిల్వ ఉంది. చెంబరంబాక్కం చెరువులో 1,317 టీఎంసీలు, పూండి చెరువులో 450 మిలియన్ ఘనపుటడుగుల నీరు ఉంది.

విధులకు హాజరైన శామ్‌సంగ్ కార్మికులు

సైదాపేట, న్యూస్‌టుడే: సమ్మె విరమించుకోవటంతో గురువారం శామ్‌సంగ్ కార్మికులు విధులకు హాజరయ్యారు. వేతన పెంపు, కార్మిక సంఘానికి ఆమోదం, 8 గంటల పని తదితర డిమాండ్లతో గత నెల రోజులుగా కార్మికులు సమ్మె బాట పట్టారు. ఈనెల 15వ తేదీ మంత్రుల నేతృత్వంలో జరిగిన చర్చల్లో సంస్థ యాజమాన్యానికి, కార్మికులకు రాజీ కుదిరింది. పలు డిమాండ్లు నెరవేర్చేందుకు యాజమాన్యం ముందుకొచ్చింది. ఇందుకు సంబంధించి ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. ఈ నేపథ్యంలో గురువారం కార్మికులు విధులకు హాజరయ్యారు.



పరిశ్రమలోకి వెళ్తున్న కార్మికులు

దీపావళికి ప్రత్యేక బస్సులు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: దీపావళి పండుగకు ప్రజలు తమ సొంతూళ్లకు వెళ్లేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక బస్సులు నడిపేందుకు రాష్ట్ర రవాణాశాఖ నిర్ణయించింది. 30 నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు నడపాలని కుంటించింది. ఎక్కువ బస్సులు అవసరం కావడంతో ప్రైవేట్ బస్సులను అద్దెకు తీసుకుంటామని మంత్రి శివశంకర్ చెప్పిన విషయం తెలిసిందే. దీని గురించి మంత్రి నేతృత్వంలో శనివారం అధికారుల సమావేశం జరుగనుంది. ఈ సందర్భంగా రోజుకు ఎన్ని బస్సులు నడపాలి, ఎంత మంది ప్రయాణించనున్నారనే అంశాలపై చర్చించనున్నారు. ఆ తర్వాతనే చివరిగా ప్రత్యేక బస్సుల సంఖ్య వెల్లడించనున్నారు.

జలవనరులు కళకళ

వడపళని, న్యూస్‌టుడే: రాష్ట్రంలో రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు పలు ప్రధాన జలాశయాల్లోకి నీరు బాగానే చేరుకుంది. బుధవారం ఉదయానికి 15 ప్రధాన జలాశయాల్లో 122 టీఎంసీల మేరకు నీరు ఉంది. మంగళవారం నుంచి 2 టీఎంసీలు పెరిగింది. డెల్టా ప్రాంతానికి కేంద్ర బిందువైన మెట్టూరులో ఇన్‌ఫ్లో 16,196 క్యూసెక్కులుండగా, 93 టీఎంసీల సామర్థ్యానికిగాను 55 టీఎంసీల నీరు చేరింది. మరో రెండు రోజులపాటు కావేరి పరివాహక ప్రాంతాల్లో వర్ష సూచనలున్నాయని వాతావరణ విభాగం పేర్కొంది. అక్టోబరు 25వ తేదీ వరకు మామూలు వర్షపాతం కన్నా కాస్త ఎక్కువగానే కురిసే వీలుందని తెలిపింది. బుధవారం ఉదయం 8.30 గంటల వరకు భవానీసాగర్ జలాశయానికి 24 మి.మీ నీరు చేరింది. నిల్వ సామర్థ్యం 20.5 టీఎంసీలకి 6 టీఎంసీ చేరుకుంది. కృష్ణగిరి, సాతనూరు డ్యామ్‌లలో 1.5, 3.6 టీఎంసీలకు పెరిగింది. పోయ్‌మార్, వరదంబికలలో నీరు ఇప్పటికే బాగా వచ్చి చేరింది. బుధవారం ఉదయం ఈ రెండు చెరువుల నుంచి 653, 950 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 90 జలాశయాల్లో 224 టీఎంసీల సామర్థ్యానికిగాను 133.66 టీఎంసీల నీటిని జలవనరుల విభాగం నిర్వహిస్తోంది. వర్షాలతో మంగళవారానికి రాష్ట్రంలోని 92 వ్యవసాయ చెరువుల్లో జలకళ సంతరించుకుంది.

ముగ్గురికి జపాన్ పురస్కారాలు



పురస్కారాలతో గ్రహీతలు

చెన్నై, న్యూస్‌టుడే: నగరంలోని జపాన్ కాన్సులేట్ తరఫున ముగ్గురికి విదేశీమంత్రి ప్రశంసా పురస్కారాలను ప్రదానం చేశారు. కేరళ, ఇతర ప్రాంతాల్లో విద్యార్థులకు జపాన్ భాష బోధిస్తూ భారతదేశంలో ఆ భాషా ప్రచారానికి తనవంతు సహకారం అందిస్తున్న ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జపనీస్ స్టడీస్ సంచాలకులు కె.అశోక్‌కుమార్, కరాటే, కుబుడో మార్షల్ ఆర్ట్స్ శిక్షణ ద్వారా భారతదేశంలో జపనీయుల సంస్కృతిని ప్రచారం చేస్తున్నందుకు షొరై-కాన్ కరాటే-దో-ఇండియా, ర్యు క్యు కొబుడో హోజోన్‌కై అధ్యక్షుడు సుబ్రమణియం హరిబాబు, తమిళనాడు, ఇతర ప్రాంతాల్లో విద్యార్థులకు జూడో శిక్షణ ద్వారా మార్షల్ ఆర్ట్స్‌ను ప్రచారం చేస్తున్నందుకు తమిళనాడు జూడో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చిలక శ్రీరాములు రాజగోపాల్‌కు పురస్కారాలను అందించారు. నగరంలోని జపాన్ కాన్సులేట్ జనరల్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో పురస్కారాలను జపాన్ కాన్సుల్ జనరల్ టకాహషి మునియో ప్రదానం చేశారు.



నీటిమట్టాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో దీప

కృష్ణాపురం జలాశయం పరిశీలన

పళ్లిపట్టు, న్యూస్‌టుడే: పళ్లిపట్టు సమీపం ఆంధ్రప్రదేశ్ చిత్తూరు జిల్లా కార్వేటినగరం మండలం అమ్మపల్లి గ్రామంలో కృష్ణాపురం జలాశయం ఉంది. జలాశయం నిండితే గేట్లు తెరచి కుశస్థలి నదిలోకి వదులుతారు. ఆ సమయం పళ్లిపట్టు యూనియన్‌లోని పలు గ్రామాల్లో వరద నీరు ప్రవేశించి ప్రజలకు ఇబ్బంది ఎదురవుతుంది. ప్రస్తుతం తమిళనాడులో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జలాశయాన్ని తిరుత్తణి ఆర్డీవో దీప, పళ్లిపట్టు తహసీల్దారు శివకుమార్, డిప్యూటీ తహసీల్దారు శేఖర్ గురువారం పరిశీలించారు. నీటిమట్టం తక్కువగా ఉన్నట్లు గుర్తించారు.

నీలగిరిలో 'పోలీసు అక్క' ప్రారంభం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: నీలగిరి జిల్లాలో బుధవారం 'పోలీసు అక్క' ప్రారంభమైంది. ఊటీ చిల్డ్రన్స్ ఫోరంలో జిల్లా ఎస్పీ నిషా ప్రారంభించారు. పోక్సో చట్టం, మహిళలపై హింసాత్మక చర్యల నివారణ, సైబర్ నేరాలు, రోడ్డు భద్రత, మాదకద్రవ్యాల దుర్వినియోగంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తారని ఎస్పీ పేర్కొన్నారు. రెండు వారాలకోసారి తమకు కేటాయించిన కళాశాలలను నేరుగా మహిళా కానిస్టేబుళ్లు సందర్శిస్తారు. కళాశాల ప్రాంగణాలు, బహిరంగ ప్రదేశాల్లో లైంగిక వేధింపులను విద్యార్థినులు వారికి తెలియజేయొచ్చన్నారు. వారి వివరాలు గోప్యంగా ఉంచి దర్యాప్తు జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. భవిష్యత్‌లో కళాశాల యాజమాన్యాలతో కలిసి ఆత్మరక్షణ తరగతులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రతి కళాశాల క్యాంపస్‌లో 'పోలీసు అక్క'ను సంప్రదించడానికి క్యూఆర్ కోడ్‌తో కూడిన నోటీసు అతికిస్తామని తెలిపారు. విద్యార్థినులు దాన్ని స్కాన్ చేసి సమస్యలు తెలియజేయొచ్చని ఎస్పీ వివరించారు. 2022 అక్టోబరులో కోవైలో 'పోలీసు అక్క' ప్రారంభమైంది. కళాశాల విద్యార్థినుల నుంచి విశేష స్పందన లభించడంతో రాష్ట్రవ్యాప్తంగా అమలు పరుస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.



లోగో ఆవిష్కరిస్తున్న ఎస్పీ నిషా

న్యాయం జరిగే వరకు పోరాటం: నటి గౌతమి



ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తనకు న్యాయం దొరికే వరకు పోరాడుతానని సినీనటి గౌతమి తెలిపారు. రామనాథపురం జిల్లా ముతుకులత్తూర్ సమీపంలో నటి గౌతమికి చెందిన 150 ఎకరాల స్థలం అమ్మిపెడతానని కారైక్కుడికి చెందిన సినీ ఫైనాన్సియర్ అళగప్పన్ రూ.3.1 కోట్లు తీసుకుని మోసం చేసినట్లు తెలుస్తోంది. అతని నుంచి తన డబ్బు ఇప్పించాలని కోరుతూ గౌతమి రామనాథపురం జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ కేసు విచారణ రామనాథపురం జిల్లా కోర్టులో ఉంది. ఈ నేపథ్యంలో గురువారం గౌతమి కోర్టు విచారణకు హాజరై న్యాయమూర్తి ఎదుట వివరణ ఇచ్చారు. అళగప్పన్‌కు బెయిల్ ఇవ్వకూడదని ఆమె న్యాయవాది వాదనలు వినిపించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. తనకు న్యాయం జరిగే వరకు పోరాడతానని చెప్పారు.

పాంబన్ కొత్త వంతెనపై ట్రయల్ రన్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: రామనాథపురం జిల్లా మండపం నుంచి రామేశ్వరం వరకు సముద్రంపై 1914లో రైల్వే వంతెన నిర్మించారు. ఓడలు వంతెన దాటే సమయంలో తెరిచి మూసేవిధంగా దీనిని నిర్మించారు. 2007లో మీటర్ గేజ్ లైన్ బ్రాడ్ గేజ్‌గా మారింది. కొన్నేళ్ల క్రితం వంతెన బలహీనపడటంతో రైళ్ల వేగాన్ని తగ్గించి నడిపారు. అయితే వంతెనపై రైళ్లు నడవడం సురక్షితం కాదని సాంకేతిక నిపుణులు హెచ్చరించడంతో రూ.550కోట్ల వ్యయంతో కొత్త వంతెన నిర్మాణ పనులను 2019లో ప్రారంభించారు. ప్రస్తుతం చివరి దశకు చేరాయి. ఈ నేపథ్యంలో దక్షిణ రైల్వే అదనపు జనరల్ మేనేజర్ కౌసల్ కిషోర్ సోమవారం వంతెనను పరిశీలించారు. వంతెనపై ప్రయోగాత్మకంగా రైలును నడిపారు. 90 కి.మీ వేగంతో 14 బోగీలున్న రైలు నడిచింది. త్వరలో వంతెన అందుబాటులోకి రానున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

కోర్టులు నిశితంగా పరిశీలించి తీర్పులివ్వాలి : ఎస్‌డీపీఐ

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: సున్నితమైన వ్యవహారాలను నిశితంగా పరిశీలించి కోర్టులు తీర్పులివ్వాలని ఎస్‌డీపీఐ జాతీయ ఉపాధ్యక్షుడు సర్ఫుద్దీన్ అహ్మద్ గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. మసీదులో జైశ్రీరామ్ నినాదాలు చేయడం తప్పుకాదని బెంగళూరు హైకోర్టు తీర్పు ఇవ్వడం సమంజసం కాదన్నారు. ఓ మతానికి చెందిన ప్రార్థనా మందిరంలో మరో మతానికి చెందిన వారు హద్దులు మీరి ప్రవేశించడం ఆహ్వానించదగ్గ అంశమనే రీతిలో కోర్టు తీర్పు ఉందని మండిపడ్డారు. ఇలాంటి తీర్పులు కుల, మత ఘర్షణలకు దారితీసేలా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. మెజారిటీ, మైనారిటీ అనే అంశాలతో ప్రజల మనోభావాలను రెచ్చగొట్టి లబ్ధిపొందాలని తహతహలాడుతున్న సంఘ్ పరివార్‌కు చెందిన వారికి ఇలాంటి తీర్పులతో బలం చేకూరే అవకాశం ఉందన్నారు. సుప్రీంకోర్టు ఈ తీర్పును సుమోటోగా తీసుకుని విచారణ జరిపి మంచి తీర్పు వెలువరించాలని కోరారు.

'పూర్వికా' సంస్థలో ఐటీ సోదాలు

సైదాపేట, న్యూస్‌టుడే: పన్ను ఎగవేత ఆరోపణలతో చెన్నై కోడంబాక్కంలోని పూర్వికా సెల్‌ఫోన్స్, ఎలక్ట్రానిక్స్ సంస్థలో ఐటీ అధికారులు గురువారం సోదాలు నిర్వహించారు. సెల్‌ఫోన్ల విక్రయంలో ముందంజలో ఉండే సంస్థ 2004లో స్థాపితమైంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 400కు పైగా శాఖలు ఉన్నాయి. ప్రధాన కార్యాలయం చెన్నై కోడంబాక్కంలో ఉంది. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం నుంచి ఐటీ అధికారులు కార్యాలయంలో తనిఖీలు చేశారు. ఉదయాన్నే లోనికి వచ్చినవారిని మినహా మిగిలిన వారినెవరినీ లోనికి అనుమతించలేదు. అలాగే సంస్థకు సంబంధించి చెన్నై పల్లికరణై కార్యాలయంలోనూ సోదాలు జరిగాయి. లెక్కలకు సంబంధించి పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రణాళిక, అభివృద్ధిశాఖపై సమీక్ష



సైదాపేట: సమీక్ష నిర్వహిస్తున్న ఉదయనిధి స్టాలిన్

సైదాపేట, న్యూస్‌టుడే: ప్రణాళిక, అభివృద్ధి శాఖ తరఫున జరుగుతున్న పనులపై సమీక్ష గురువారం సచివాలయంలో జరిగింది. ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ నేతృత్వం వహించారు. అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలు, వాటి పురోగతి తదితర పలు విషయాలు ఈ సందర్భంగా చర్చించారు. కార్యక్రమంలో శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి రమేష్ చంద్ మీనా, ఎకనామిక్స్, స్టాటిస్టిక్స్ విభాగ డైరెక్టర్ గణేష్, రాష్ట్ర ప్రణాళిక సంఘ సభ్య కార్యదర్శి సుధ, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో విద్యార్థుల భద్రతపై...

ఆర్కేనగర్: రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాల ప్రభావం అధికంగా ఉన్న నేపథ్యంలో చెన్నై సచివాలయంలో గురువారం పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేశ్ నేతృత్వంలో పాఠశాలల భవనాల పటిష్టతకు సంబంధించి అధికారులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని పాఠశాలల్లో విద్యార్థుల భద్రతకు చర్యలు, ముందస్తు జాగ్రత్త చర్యలపై పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ద్వారా ప్రామాణిక మార్గదర్శకాలను జారీ చేశారు. వర్షాకాలంలో పాఠశాలల్లో విద్యార్థులకు భద్రత కల్పించాలని మంత్రి అన్ని జిల్లాల ప్రాథమిక విద్యాశాఖాధికారులకు సూచనలు చేశారు. అదేవిధంగా పాత భవనాలను ప్రజాపనులశాఖ ద్వారా తొలగించే పనులను త్రైమాసిక పరీక్షల సెలవుల్లో ప్రారంభించారు. ఆ పనులు త్వరగా ముగించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని, శిథిలావస్థలో ఉన్న భవనాలను ఉపయోగించకూడదని, జలవనరుల ప్రాంతాలకు విద్యార్థులు వెళ్లకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తగిన సూచనలు చేయాలని మంత్రి ఆదేశించారు. అనంతరం చేపాక్కం-తిరువల్లికేణి నియోజకవర్గంలోని లేడీ వెలింగ్టన్ పాఠశాలకు వెళ్లి భవనాల పటిష్టతను పరిశీలించారు. విద్యార్థుల హాజరు గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.



ఆర్కేనగర్: లేడీ వెలింగ్టన్ పాఠశాల భవనాలను పరిశీలిస్తున్న మంత్రి అన్బిల్ మహేశ్

వినోద కార్యక్రమం వీక్షించేందుకు మెట్రో ప్రయాణికులకు వెసులుబాటు

వడపళని, న్యూస్‌టుడే: చెన్నై మెట్రో రైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) ఆధ్వర్యంలో జరగనున్న వినోద కార్యక్రమానికి ప్రయాణికులకు వెసులుబాటుతో కూడిన ప్రయాణ వసతి కల్పించేందుకు 'జీఎస్ఎస్ టార్క్ ఎంటర్‌టైన్‌మెంట్ ఎల్ఎల్‌పీ' సంస్థ చేతులు కలిపింది. 19వ తేదీ నందనం మెట్రో స్టేషను సమీపంలోని వైఎంసీఏ మైదానంలో 'హిప్‌హాప్ తమిళ రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్ మచి' కార్యక్రమానికి జీఎస్ఎస్ టార్క్ సంస్థ ప్రయాణికులకు సహకరిస్తోంది. పేటీఎం ద్వారా టిక్కెట్లు బుక్ చేసుకునే వారికి డిజిటల్ మెట్రో పాస్‌లు అందుతాయి. ప్రయాణికులు ఎంపిక చేసుకున్న మెట్రో స్టేషను నుంచి నందనం స్టేషను వరకు వెళ్లి తిరిగి వచ్చే వీలుంటుంది. నందనం స్టేషను నుంచి చివరి రైలు అర్ధరాత్రి 00.15 గంటలకు బయలుదేరి వింకోనగర్ డిపో మెట్రో స్టేషనుకు చేరుతుంది. 00.30 గంటలకు ఎయిర్‌పోర్ట్ మెట్రో స్టేషనుకు రైలు నడుస్తుంది. రైలు సమయానికి పది నిమిషాల ముందుగా రావాలి. గ్రీన్ లైన్‌లో ప్రయాణించే వారు చెన్నై సెంట్రల్ మెట్రో స్టేషనులో ఇంటర్ ఛేంజ్ కావాల్సి ఉంటుంది.

13 ఏళ్ల తర్వాత.. కుటుంబాన్ని కలుసుకున్న ఆంధ్రా వ్యక్తి

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: మతిస్థిమితం కోల్పోయిన ఓ వ్యక్తి 13ఏళ్ల తర్వాత కుటుంబాన్ని కలుసుకున్నాడు. తంజావూర్ జిల్లా కలెక్టర్ ప్రియాంక పంకజం మతిస్థిమితంలేని బాధితుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. వారిని కాపాడి చికిత్స అందించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ క్రమంలో పూదలూర్ సెంగిపట్టి ప్రాంతంలో 40ఏళ్ల వ్యక్తి మతిస్థిమితం లేకుండా తిరుగుతూ కనిపించాడు. అతన్ని తంజావూర్ ఆస్పత్రిలోని ప్రత్యేక కేంద్రానికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు మందులు తీసుకున్నాడు. తెలుగులో మాట్లాడుతుండటంతో ఏ ప్రాంతానికి చెందినవారో తెలుసుకోలేకపోయారు. నెల తర్వాత తెలుగు తెలిసిన మహిళ ద్వారా వివరాలు సేకరించారు. అతని పేరు ప్రసాద్ అని, ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లాకు చెందినవాడని గుర్తించి అక్కడి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారి ద్వారా సమాచారం అందుకున్న కుటుంబీకులు బుధవారం తంజావూర్ కలెక్టరేట్‌కు వచ్చారు. 13ఏళ్ల కిందట తప్పిపోయిన ప్రసాద్‌ను కుటుంబీకులకు కలెక్టర్ అప్పగించారు.



ప్రసాద్

నటరాజస్వామికి ప్రత్యేక పూజలు

తిరువణ్ణామలై, న్యూస్‌టుడే: తిరువణ్ణామలై అరుణాచలేశ్వర స్వామి ఆలయంలో ఉన్న నటరాజస్వామి, శివగామి సుందరికి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. పెరటాసి మాసంలో చంద్రుడు చతుర్థశి తిథిలోకి ప్రవేశించడంతో శివగామి సుందరి సమేత నటరాజస్వామికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, దీపారాధనలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.



తిరువణ్ణామలై: అలంకరణలో నటరాజస్వామి, శివగామి సుందరి



రెడ్‌హిల్స్: పండ్లు, కూరగాయలతో ఆలయాన్ని అలంకరించిన దృశ్యం

● **కరుమారియమ్మన్‌కు... రెడ్‌హిల్స్:** పూండిమల్లి సమీప తిరువేర్కాడులోని పురాతన కరుమారి అమ్మవారి ఆలయంలో ఆషాఢ పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం 3 టన్నుల పండ్లు, కూరగాయలు, మూలికా మొక్కలు, మిఠాయిలతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా బంగారు అడిగళార్ విగ్రహ ప్రతిష్ఠ



బంగారు అడిగళార్ విగ్రహానికి దీపారాధన చేస్తున్న లక్ష్మీఅమ్మ

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: మేల్‌మరువత్తూరులోని ఆదిపరాశక్తి ఆధ్యాత్మిక పీఠం ఆధ్వర్యంలో దివంగత పీఠాధిపతి, ఆధ్యాత్మిక గురువు బంగారు అడగళార్ దివ్య ప్రతిమ ప్రతిష్ఠాపన వేడుక గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. పీఠాధిపతి లక్ష్మీఅమ్మ సమక్షంలో బంగారు అడిగళార్ విగ్రహాన్ని ప్రతిష్ఠించి అభిషేకం, కలశదీపం, యజ్ఞ పూజ నిర్వహించారు. అదేవిధంగా ఆయన దివ్య పాదాలకు విశేష పూజలు చేశారు. పీఠం ఉప ఛైర్మన్లు అన్బళగన్, సెంథిల్‌కుమార్, శ్రీదేవి, ఉమాదేవి, శ్రీలేఖ, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. శుక్రవారం రెండో విడత కలశదీపం, 19న సంప్రోక్షణ, అభిషేకం, ఆరాధన, గురుదర్శనం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



పాదాభిషేకం చేస్తున్న దృశ్యం

తగ్గిన విద్యుత్తు వినియోగం

వడపళని, న్యూస్‌టుడే: రాష్ట్రంలో గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో విద్యుత్తు వినియోగం బాగా తగ్గింది. 15వ తేదీ రాష్ట్రవ్యాప్తంగా వినియోగం 20 శాతం వరకు తగ్గి 302 మిలియన్ యూనిట్లకు చేరింది. అక్టోబరు మొదట్లో 380 మిలియన్ యూనిట్ల మేర తగ్గిందని టాన్‌జెడ్కో పేర్కొంది. రాష్ట్రంలోకి ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించినప్పటి నుంచి వినియోగంలో బాగా తేడా కనిపిస్తోందని, అక్టోబరు 1వ తేదీ 389 యూనిట్లు ఉండగా, సెప్టెంబరులో ఎండ ప్రభావంతో 400 మిలియన్ యూనిట్లు దాటిందని తెలిపింది. చెన్నైలో మంగళవారం 2,775 మెగావాట్ల డిమాండు ఉండగా, మొత్తం వినియోగం 64.337 మిలియన్ యూనిట్లు. అక్టోబరు 1న నగరంలో 3,664 మిలియన్ యూనిట్ల వరకు డిమాండు కనిపించింది. వినియోగం 82.94 మిలియన్ యూనిట్లు. నగరంలో మొత్తంమీద వినియోగం 22 శాతం కన్నా ఎక్కువేనని టాన్‌జెడ్కో వివరించింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా గృహాలు, వ్యవసాయానికి వినియోగం బాగా తగ్గినట్టు అధికారులు పేర్కొన్నారు.

వరద నియంత్రణ చర్యల్లో ప్రభుత్వం విఫలం: రామదాస్

సైదాపేట, న్యూస్‌టుడే: వరద నియంత్రణ పనుల్లో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని పీఎంకే వ్యవస్థాపకులు రామదాస్ ఆరోపించారు. దిండివనం సమీప తైలాపురం ఫాం హౌస్‌లో ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడుతూ... డీఎంకే ప్రభుత్వం ఉపాధ్యాయులకు సెప్టెంబర్ నెల జీతం 10 రోజులు ఆలస్యంగా ఇచ్చిందని తెలిపారు. ఉమ్మడి విద్యా పథకం కింద కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడమే ఆలస్యానికి కారణమని తెలుస్తోందన్నారు. ఎన్నికల హామీల్లో విద్య, ఆరోగ్యానికి మూడు రెట్లు ఎక్కువగా నిధులు కేటాయిస్తామని డీఎంకే చెప్పిందని గుర్తుచేశారు. ఆ హామీని నెరవేర్చి ఉంటే ప్రస్తుతం ఉపాధ్యాయులకు జీతాలు ఇవ్వడంలో సమస్య వచ్చుండేది కాదన్నారు. చెన్నైలో పలుచోట్ల ఇంకా వాన నీరు నిలబడి ఉందని, వరద నివారణ పనుల్లో డీఎంకే ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. వర్షానికి దెబ్బతిన్న పంటలకు ఎకరానికి రూ.40 వేలు సాయం అందించాలని డిమాండ్ చేశారు.

తొలగని నీరు.. తప్పని కష్టాలు


కలెక్టరుకు సూచనలిస్తున్న ఉదయనిధి

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: భారీ వర్షాలకు తిరునిండ్రవూరులోని ఈశా చెరువు పూర్తిగా నిండి పొంగిపొర్లుతోంది. దీంతో పెరియార్‌నగర్, ముత్తమిళ్‌నగర్, కన్నికాపురం, స్వదేశీనగర్, రామనాథపురం ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. ఈ ప్రాంతవాసులను అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు. ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ ముంపు ప్రాంతాలను బుధవారం సాయంత్రం సందర్శించారు. వర్షపు నీటిని భారీ మోటార్లతో తొలగించాలని ఆదేశించారు. చెరువులో పూడిక తీయకపోవడంతో కొద్దిపాటి వర్షానికే చెరువు నిండిందని ప్రజలు వాపోయారు. వర్షాకాలం తర్వాత పూడిక తీయిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ ప్రభుశంకర్ వెంట ఉన్నారు.

నిలిచిన నీటితో ఇబ్బందులు

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: అల్పపీడనం కారణంగా తిరువళ్లూరు, పరిసర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. దీంతో కాక్కళూరు, సాయినగర్, పూంతోట్టం ప్రాంతాల్లో మోకాళ్లలోతు నీరు నిలిచింది. ఆ ప్రాంతవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గురువారం వర్షం తగ్గుముఖం పట్టింది. అయినా వాననీరు తొలగకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని భయపడుతున్నారు. మున్సిపల్ అధికారులు నీటిని తొలగించేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


రెడ్‌హిల్స్: పూంతోట్టంలో వాననీటిలో వెళ్తున్న ప్రజలు

నీటిని తొలగించేందుకు 'ఎన్ఎల్‌సీ' సాయం

వడపళని, న్యూస్‌టుడే: చెన్నై నగరంలో కురిసిన భారీ వర్షాలకు వరద ప్రాంతాల్లో నీటిని తోడేందుకు 'ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్' అధిక సామర్థ్యం కలిగిన 25 హెచ్‌పీ ఇండస్ట్రియల్ పంపులను బుధవారం తరలించింది. పంపులతో పాటు నిపుణులు, సీనియర్ అధికారులు కూడా వెళ్లారని ఎన్ఎల్‌సీ ఓ ప్రకటనలో తెలిపింది. బృందానికి డైరెక్టర్ (మైన్స్) డాక్టర్ సురేష్ చంద్ర సుమన్ జెండా ఊపి సాగనంపారు.


ఎన్ఎల్‌సీ బృందం



కొండచిలువతో అగ్నిమాపక సిబ్బంది

వర్షాలకు ఇళ్లలోకి వచ్చిన 200 పాముల పట్టివేత

ఆర్కేనగర్, మహాబలిపురం, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా కురిసిన భారీవర్షాలకు వరదలో కొట్టుకొచ్చిన పాములను పట్టుకోవాలని అగ్నిమాపక, రికవరీ కంట్రోల్ రూమ్‌కు 211 ఫోన్‌కాల్స్ వచ్చాయి. ఇందులో చెన్నై, తిరువళ్లూర్, కాంచీపురం, చెంగల్పట్టు, రెండు ఉత్తర జిల్లాల నుంచి అధికంగా ఉన్నాయి. దీంతో అగ్నిమాపక సిబ్బంది వాననీటిలో కొట్టుకొచ్చిన 200కు పైగా పాములను పట్టుకున్నారు. చెంగల్పట్టు జిల్లా పమ్మల్ సమీప పొళిచ్చలూర్ జ్ఞానమణి వీధిలో మురుగన్ ఇంట్లో బుధవారం రాత్రి చొరబడిన 10 అడుగుల పొడవున్న కొండ చిలువను పట్టుకున్నారు. పాములను అటవీశాఖ సిబ్బందికి అప్పగించారు.


చెన్నై మహానగర కార్పొరేషన్ తరఫున సంగనల్లూర్‌లోని పూంతోట్టం 3వ వీధిలో గురువారం ఏర్పాటైన ప్రత్యేక వైద్య శిబిరం - చెన్నై, న్యూస్‌టుడే

బృహదీశ్వరాలయంలో పురాతన శిలాశాసనం లభ్యం


వెలుగు చూసిన మరాఠా శిలా శాసనాలు

వేళచ్చేరి, న్యూస్‌టుడే: తంజావూర్ బృహదీశ్వరాలయంలో ప్రత్యేకమైన శిలాశాసనం వెలుగు చూసింది. తంజావూర్‌ను చోళ రాజులు పాలించిన తరువాత పాండ్యులు, నాయకర్‌లు, మరాఠా రాజులు, బ్రిటీష్ వారు పరిపాలించారు. మరాఠా రాజు ఛత్రపతి శివాజీ సోదరుడు వెంబోజీ తంజావూర్‌ను 1674లో స్వాధీనం చేసుకున్నారు. ఆయన తరువాత 1684లో మొదటి సాఖూజీ, 1712 నుంచి 1728 వరకు మొదటి శరబోజీ పాలన చేశారు. శరబోజీ పాలనలో ఓ అభియోగానికి సంబంధించి దోషికి విచిత్రమైన శిక్ష విధించారు. దాని గురించి బృహదీశ్వరాలయంలోని గణపతి సన్నిధిలో వాయువ్య దిశన ఉన్న శిలాశాసనంలో పొందుపరిచారు. ఆ శాసనం ప్రస్తుతం వెలుగు చూసింది. దీని గురించి మైసూర్‌లోని కేంద్ర పురావస్తుశాఖ సదరన్ జోన్ శిలాశాసనాల విభాగం డైరెక్టర్ మునిరత్నం మాట్లాడుతూ... బృహదీశ్వరాలయం గోడలు, స్తంభాలపై అనేక శిలాశాసనాలు ఉన్నాయని, వాటిని కేంద్ర పురావస్తు శాఖ గ్రంథాలుగా చేసిందని తెలిపారు. అవి మైసూర్‌లో ఉన్నాయని, తమిళ శిలాశాసనాలను ఇప్పటికే చాలా మంది చదివారని, కానీ మరాఠా శాసనాలు ఎవరూ చదవలేదన్నారు. ప్రస్తుతం దేశంలోని మరాఠా శాసనాలను విశదీకరించి ప్రచురించే పనుల్లో కేంద్ర పురావస్తుశాఖ నిమగ్నమై ఉందని తెలిపారు. బృహదీశ్వరాలయంలో మరాఠా శాశసనం ప్రస్తుతం చదివారని, అది 1724 నాటిదన్నారు. అంటే తుల్జా మహారాజు కుమారుడు శరబోజీ కాలంలో శాసనం చేయబడిందని తెలిపారు. శాసనంలో.. తంజై నగర్‌లోని వెట్టియాన్ (కాటికాపరి) కాలనీ అనే భూమిపై హక్కుకు సంబంధించి తంజియాన్, కొడియాన్ సినాన్, కల్వాతి అనే వారి మధ్య వివాదం ఉండేదని, ఈ వ్యవహారం మహారాజు వరకు వెళ్లగా ఆ నలుగురిని మరుగుతున్న నెయ్యిలో చేతి వేళ్లను ఉంచమని ఆదేశించాడని, దాని ఫలితంగా తంజియాన్‌కు అనుకూలంగా తీర్పునిచ్చారనే సమాచారం ఉందని పేర్కొన్నారు.

ఏటా తగ్గుతున్న వరి సాగు

ప్రత్యామ్నాయ మార్గంలో ఈరోడ్ జిల్లా రైతులు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: వ్యవసాయ భూములను ఇళ్ల స్థలాలుగా మార్చడం, పంటకు గిట్టుబాటు ధర అందకపోవడం తదితర కారణాల వలన గత మూడేళ్లుగా ఈరోడ్ జిల్లాలో వరి సాగు విస్తీర్ణం తగ్గుతోందని వ్యవసాయశాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. దీంతో గత్యంతరం లేక పలువురు రైతులు ప్రత్యామ్నాయ మార్గాల వైపు మరలుతున్నారు. రాష్ట్రంలో కావేరి నది ప్రవహిస్తున్న తిరుచ్చి, తంజావూరు, తిరువారూర్, నాగపట్నం, పుదుక్కోట్టై జిల్లాల తర్వాత ఈరోడ్ జిల్లాలో వరి అధికంగా సాగవుతుంది. అయితే పలువురు రైతులు వ్యవసాయ భూములను రియల్ ఎస్టేట్ సంస్థలకు విక్రయించడం, పంట ఉత్పత్తులకు తగిన గిట్టుబాటు ధర అందని కారణంగా రైతులు వరి సాగు చేయడం తగ్గించారు. ఈరోడ్ జిల్లాలో కీళ్‌భవాని, కొడివేరి, కళింగరాయ సాగునీటి కాలువ ప్రాంతాలలో మూడు సీజన్లలో అవసరం మేరకు సీజన్‌కు సరాసరి 30-35 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోలు చేస్తున్నారు. వీటిని అత్యాధునిక రైస్ మిల్లులలో బియ్యంగా మార్చి పౌరసరఫరాల శాఖ రేషన్ దుకాణాలకు పంపుతోంది. ఈ నేపథ్యంలో జిల్లాలో ఒకే ఏడాది 15 వేల మెట్రిక్ టన్నుల కొనుగోలు తగ్గడం దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. 2024-25 ఏడాదికిగాను ప్రస్తుతం వరి నాటుతున్నారు. గతేడాదికన్నా ఈ ఏడాది సాగు తగ్గినట్టు తెలుస్తోంది. రైతులు మాట్లాడుతూ.. రెండేళ్లుగా మేట్టూర్ జలాశయం కుడి కాలువకు సాగునీరు విడుదల చేయని కారణంగా వరి సాగు విస్తీర్ణం తగ్గినట్టు గుర్తు చేశారు. అందువల్ల పలువురు రైతులు వ్యవసాయం మానేసి ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలకు మళ్లినట్లు తెలిపారు. చదువుకున్న యువతీయువకులు ఉద్యోగాలకు మళ్లడంతో భవిష్యత్తులో ప్రభుత్వమే వ్యసాయం చేసే పరిస్థితి ఏర్పడుతుందని అభిప్రాయపడ్డారు.



తాగునీటి పైపులు ధ్వంసం

పళ్లిపట్టు, న్యూస్‌టుడే: పళ్లిపట్టు తాలూకా కొడివలస పంచాయతీలో 11వేల మంది ప్రజలు నివసిస్తున్నారు. వీరికి 3వేల లీటర్ల సామర్థ్యంగల తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంకు ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గుర్తు తెలియని వ్యక్తులు తాగునీటి పైపులను ధ్వంసం చేశారు. గురువారం ఉదయం తాగునీరు రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పంచాయతీ అధ్యక్షురాలు వసంతా ప్రకాశం ఘటనా స్థలానికి వెళ్లి కొత్త పైపులను అమర్చి నీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకున్నారు. ఆమె ఫిర్యాదు మేరకు పొదట్టూరుపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంబత్తూర్‌లో ప్రభుత్వ ఆస్పత్రి ఏర్పాటయ్యేనా?

విల్లివాక్కం, న్యూస్‌టుడే: అంబత్తూర్‌లో ప్రభుత్వ ఆస్పత్రి లేక కార్మికులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నియోజకవర్గంలో 5 లక్షల మందికి పైగా జనాభా ఉన్నారు. ఇక్కడి పారిశ్రామికవాడలో 1,800కుపైగా చిన్న, పెద్ద కర్మాగారాలున్నాయి. రెడీమేడ్ దుస్తుల ఎగుమతి సంస్థలు, ఐటీ సంస్థలు కూడా పని చేస్తున్నాయి. కర్మాగారాలు, భవన నిర్మాణాల్లో చోటు చేసుకుంటున్న ప్రమాదాల్లో గాయాలపాలవుతున్న కార్మికులకు వైద్య అందించేందుకు ప్రభుత్వ ఆస్పత్రి అందుబాటులో లేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేశారు. క్షతగాత్రులను జీహెచ్, కీల్పాక్కం, రాయపేట, స్టాన్లీ, ఓమందూర్ ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించాల్సి వస్తోంది. దూరం, ట్రాఫిక్ రద్దీ కారణంగా అక్కడికెళ్లేలోపు పలువురు మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంబత్తూరులోనే ఆస్పత్రి నిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నా ఇప్పటి వరకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని ప్రజలు ఆరోపించారు. అంబత్తూర్ ఎమ్మెల్యే జోసఫ్ శామ్యూల్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రి విషయమై శాసనసభలో రెండుసార్లు మాట్లాడానని చెప్పారు. ఆస్పత్రి నిర్మాణానికి స్థలం అన్వేషిస్తున్నట్లు మంత్రి మా. సుబ్రమణియన్ చెప్పారన్నారు.



అంబత్తూర్ రైల్వేస్టేషన్


ఈశాన్య రుతుపవనాల వర్షాలు ప్రారంభమవడంతో చెంగల్పట్టులో సంబా సీజన్ వరినాట్లు వేస్తున్న దృశ్యం - మహాబలిపురం, న్యూస్‌టుడే

పేదలకు సాయం పంపిణీ


దుప్పట్లు అందజేస్తున్న మంత్రి నాజర్

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: కలైజ్ఞర్ శత జయంతి ముగింపు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి పుట్టినరోజు వేడుకలను 47 రోజుల పాటు నిర్వహించి పేదలకు సాయం చేసేందుకు డీఎంకే శ్రేణులు నిర్ణయించాయి. ఆ మేరకు తొలి కార్యక్రమం తిరువళ్లూరులో గురువారం ప్రారంభించారు. మంత్రి నాజర్ అధ్యక్షత వహించి 32 వేల మంది నిరుపేదలకు నిత్యావసర సరకులు, దుప్పట్లు అందజేశారు. ఎమ్మెల్యే కృష్ణస్వామి, రాష్ట్ర సర్వసభ్య సభ్యుడు ఎత్తిరాజ్, యూనియన్ కార్యదర్శి రామకృష్ణన్ పాల్గొన్నారు.

మంత్రివర్గ నిర్ణయానికి గవర్నర్ కట్టుబడి ఉండాలి

హైకోర్టు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: రాష్ట్ర మంత్రివర్గ నిర్ణయానికి గవర్నర్ కట్టుబడి ఉంటారని ఓ కేసు విషయంలో మద్రాసు హైకోర్టు అభిప్రాయం వ్యక్తం చేసింది. హత్య కేసులో యావజ్జీవ శిక్ష పడి పుళల్ కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న వీరభారతి అనే ఖైదీ తరఫున మద్రాసు హైకోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. సత్ప్రవర్తన కారణంగా తనను త్వరగా విడుదల చేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని అందులో కోరారు. 20 ఏళ్లకుపైగా తాను శిక్ష అనుభవిస్తున్నానని, సత్ప్రవర్తన కారణంగా పలువురు ఖైదీలను ముందుగానే విడుదల చేస్తున్నందున తననూ విడుదల చేయాలని కోరుతూ జైళ్లశాఖ డీజీపీ నేతృత్వంలోని రాష్ట్ర స్థాయి కమిటీకి వినతిపత్రం అందించినట్లు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి కమిటీ సిఫారసుల మేరకు ఫైళ్లను ముఖ్యమంత్రికి పంపించారని, ముఖ్యమంత్రి నేతృత్వంలోని మంత్రివర్గం అందుకుగాను ఆమోదం తెలిపి గవర్నర్ ఆమోదం కోసం పంపిందని తెలిపారు. కానీ, గవర్నర్ విడుదలకు నిరాకరించారని, ఆయన ఆదేశాలను రద్దు చేసి తనను ముందుగా విడుదల చేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరాడు. ఈ కేసుని గురువారం విచారించిన న్యాయమూర్తులు జస్టిస్ ఎస్ఎం సుబ్రమణ్యం, జస్టిస్ శివజ్ఞానం ధర్మాసనం.. దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ హత్య కేసులో శిక్ష విధించిన తర్వాత విడుదలైన పేరరివాలన్ తదితరుల కేసులలో సుప్రీంకోర్టు తీర్పులను ఉటంకిస్తూ కేబినెట్ నిర్ణయాలకు గవర్నర్ కట్టుబడి ఉంటారని పేర్కొంది. గవర్నర్ దానిని ధిక్కరించి వ్యవహరించలేరని, ఖైదీలను విడుదల చేయాలని మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకించే వ్యక్తిగత నైతిక హక్కు గవర్నర్‌కు లేదని తెలిపింది. పిటిషన్‌దారుడిని త్వరగా విడుదల చేయాలన్న వినతిని పునర్‌పరిశీలించాలని ఆదేశించింది. అప్పటివరకు ఆయనకు మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని తీర్పునిచ్చింది.


రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో సీటు రాకపోవచ్చు

మంత్రి పొన్ముడి



విల్లివాక్కం, న్యూస్‌టుడే: విల్లుపురం జిల్లా కలైజ్ఞర్ అరివాలయంలో జిల్లా నిర్వాహకుడు గౌతమ శిఖామణి నేతృత్వంలో విల్లుపురం సౌత్ డీఎంకే ఏజెంట్ల సమావేశం జరిగింది. ఇందులో అటవీ శాఖ మంత్రి పొన్ముడి, ఎమ్మెల్యే లక్ష్మణన్, అన్నియూర్ శివతోపాటు ముఖ్య నిర్వాహకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్ముడి మాట్లాడుతూ.. రానున్న అసెంబ్లీ ఎన్నికలలో ఎవరినైనా అభ్యర్థిగా నిలబెట్టవచ్చునని, తనకు కూడా సీటు కేటాయించకపోవచ్చని తెలిపారు. ఎవరిని నిలిపినా డీఎంకే విజయానికి నిర్వాహకులు శ్రమించాలని కోరారు.

ధరణి వరాహస్వామికి పుష్పయాగం



పళ్లిపట్టు, న్యూస్‌టుడే: పళ్లిపట్టు తాలూకా మేల్‌పొదట్టూరుపేటలో ధరణి వరాహస్వామి ఆలయం ఉంది. ఇక్కడ బ్రహ్మోత్సవాలు గత శనివారం మొదలయ్యాయి. రోజూ స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి వివిధ వాహనాల్లో ఊరేగిస్తున్నారు. చివరిరోజు గురువారం పుష్పయాగం జరిగింది. వివిధ రకాల పుష్పాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.


వంతెన కింద ఏర్పాటు చేసిన స్తంభాలు

వంతెనల కింద నీటిలో చిక్కుకోకుండా చర్యలు

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: కోవైలో 3 రోజుల పాటు భారీ వర్షాలు కురిశాయి. దీంతో పలు ప్రాంతాల్లో నడుము లోతు వాననీరు నిలవడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. ప్రధానంగా సాయిబాబా కాలనీ, శివానందకాలనీలోని వంతెన వద్ద రెండు బస్సులు చిక్కుకోవడంతో ప్రయాణికులను అతి కష్టం మీద కాపాడారు. ఈ తరహా ఘటనలను నివారించేందుకు ట్రాఫిక్ పోలీసులకు సరికొత్త ఆలోచన తట్టింది. దానిని గురువారం అమలు చేశారు. ఈ మేరకు వంతెనల కింద భాగంలో పచ్చ, ఎరుపు, పసుపు రంగులతో కూడిన స్తంభాలు ఏర్పాటు చేశారు. వర్షం కురిసేటప్పుడు ఈ స్తంభాల్లో పచ్చ రంగు కనిపిస్తే వాహనాలు వెళ్లవచ్చు. పసుపు రంగు కనిపిస్తే నెమ్మదిగా వెళ్లాల్సి ఉంటుంది. ఎరుపు రంగు కనిపిస్తే వెళ్లకూడదు. ఈ ఆలోచన మంచి ఫలితాన్ని ఇచ్చిందని పోలీసులు వెల్లడించారు.

ఘనంగా అన్నాడీఎంకే వార్షికోత్సవం

తిరుత్తణి, న్యూస్‌టుడే: అన్నాడీఎంకే తిరువళ్లూర్ జిల్లా దక్షిణ విభాగ విద్యార్థుల సంఘ జాయింట్ కార్యదర్శి జయశేఖర్‌బాబు ఆధ్వర్యంలో ఆ పార్టీ వార్షికోత్సవం గురువారం తిరుత్తణిలో ఘనంగా జరిగాయి. పార్టీ వర్గీయులు పాల్గొని తిరుత్తణి చెన్నై బైపాస్ రోడ్‌లోని మాజీ ముఖ్యమంత్రులు ఎంజీఆర్, జయలలిత విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీ కె.హరి, రాష్ట్ర ఎంజీఆర్ మండ్రం జాయింట్ కార్యదర్శి వినాయకం తదితరులు పాల్గొన్నారు.


ఎంజీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పార్టీ వర్గీయులు

పవన్ కల్యాణ్‌కు ఓపీఎస్ కృతజ్ఞతలు

సైదాపేట, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీర్‌సెల్వం కృతజ్ఞతలు తెలిపారు. ఆయనకు రాసిన లేఖలో.. అన్నాడీఎంకే 53వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ నాయకులు, శ్రేణులకు శుభాకాంక్షలు తెలిపిన పవన్ కల్యాణ్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలని తెలియజేశారు.

వంతెన పైనుంచి పడి యువకుడి మృతి

పెరియపాళ్యం: ఆవడి మప్పేడుకు చెందిన రోహిన్ (26) గురువారం ద్విచక్ర వాహనంపై పెరియపాళ్యం సమీప కొమక్కం బేడుకు వెళ్లాడు. అక్కడ వంతెనపై నిలబడి సెల్‌ఫోన్‌లో మాట్లాడుతుండగా అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. వెంగల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో గున్న ఏనుగు...

విల్లివాక్కం: సత్యమంగళం పులుల అభయారణ్యం నుంచి రక్షించిన ఏనుగు పిల్లను నీలగిరి జిల్లా ముదుమలై తెప్పకాడు ఏనుగుల శిబిరంలో సంరక్షిస్తున్నారు. దీని ఆరోగ్యం క్షీణించడంతో చికిత్స అందించారు. ఈ నేపథ్యంలో గురువారం ప్రాణాలు కోల్పోయింది.

ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: ప్రేమ విఫలం కావడంతో కళాశాల భవనం మూడో అంతస్తు నుంచి దూకి ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తంజావూర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తంజావూర్ జిల్లా పట్టుకోట్టై ప్రాంతానికి చెందిన విజయకుమార్ కుమారుడు మణికంఠన్ (20) సిరుగనూర్‌లోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్నాడు. మణింఠన్ తోటి విద్యార్థినిని ప్రేమించాడు. అతని ప్రేమను యువతి నిరాకరించడంతో కొన్నిరోజులుగా మనస్తాపంతో ఉన్నాడు. ఈ నేపథ్యంలో మణికంఠన్ బుధవారం కళాశాల భవనం మూడో అంతస్తు పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేపట్టారు.

6 వాహనాలను ఢీకొన్న లారీ

ఇద్దరికి గాయాలు

మహాబలిపురం: ఉత్తర చెన్నై నుంచి ఉత్తిరమేరూర్‌లోని రామ్‌కో సిమెంట్ పరిశ్రమకు బూడిద లోడుతో ఓ లారీ బుధవారం బయలుదేరింది. రామనాథపురం జిల్లా తిరువాడనై సమీప ఏరైయూర్‌కు చెందిన మునుసామి డ్రైవరు. మరైమలైనగర్ సమీప జీఎస్టీ రోడ్డులో సాయంత్రం వెళుతుండగా అదుపుతప్పిన లారీ ప్రైవేటు సంస్థకు కార్మికులను తీసుకెళ్లే వ్యాను, కారు, ఆటో, ద్విచక్ర వాహనం తదితర 6 వాహనాలను వరుసగా ఢీకొంది. ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. వారిని ట్రాఫిక్ పోలీసులు ఆసుపత్రికి తరలించారు. లారీ డ్రైవర్‌ను అరెస్టు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

ప్రమాదానికి గురైన కారు →



తగాదాలో వ్యాపారి ముక్కు కొరికి వ్యక్తి పరారీ

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: వేలూర్ జిల్లా కారణంపట్టుకు చెందిన పరశురామన్, తమిళరసన్ చిరు వ్యాపారులు. అన్నదమ్ములైన వీరి ఇంటి ఎదుట మోకాళ్లలోతు వర్షపు నీరు చేరింది. దీంతో ఇద్దరూ కలిసి ఇంటి ఎదుట నడవడానికి ఇసుక బస్తాలను ఏర్పాటు చేశారు. వీరి చర్యలను పక్కింట్లోని రమేష్ ఖండించాడు. ఇందుకు సంబంధించి వాగ్వాదం చోటుచేసుకుంది. ఆవేశంతో రమేష్.. పరశురామన్‌పై హాకీ బ్యాట్‌తో దాడి చేయడమే కాకుండా తమిళరసన్ ముక్కు కొరికి పారిపోయాడు. సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని బాధితులను ఆస్పత్రికి తరలించి పరారీలో ఉన్న రమేష్ కోసం గాలిస్తున్నారు.

రూ.50 కోట్ల విలువైన మత్తుపదార్థాల స్వాధీనం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తూత్తుకుడి ముప్పునాడు ప్రాంతానికి చెందిన దురై అనే వ్యక్తి ఇంట్లో మత్తుపదార్థాలు దాచి ఉంచినట్లు కోస్టుగార్డ్ పోలీసులకు సమాచారం అందింది. ఆ మేరకు బుధవారం దురై ఇంట్లో సోదా జరిపి 300 కిలోల రూ.50 కోట్లు విలువచేసే మత్తుపదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సినీనటుడు కరుణాకరన్ ఇంట్లో 60 సవర్ల నగల చోరీ

పనిమనిషి అరెస్ట్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: ఓ సినీ నటుడు ఇంట్లో 60 సవర్ల బంగారు నగలు కాజేసిన మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. చెన్నై తురైపాక్కం రాజీవ్‌గాంధీ రోడ్డులోని ఓ అపార్ట్‌మెంట్‌లో సినీ నటుడు కరుణాకరన్ నివసిస్తున్నారు. ఈయన ఇంట్లోని బీరువాలో ఉన్న 60 సవర్ల బంగారు నగలు అదృశ్యమయ్యాయి. దీంతో ఆయన భార్య కన్నగినగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేపట్టి ఇంట్లో పని చేసే కారప్పాక్కం కాళియమ్మన్ ఆలయ వీధికి చెందిన విజయ (44) అనే మహిళను అరెస్ట్ చేసి నగలను స్వాధీనం చేసుకున్నారు.

బాలికపై సామూహిక అత్యాచారం

నలుగురు యువకుల అరెస్టు

వేళచ్చేరి, న్యూస్‌టుడే: విళుపురం జిల్లా దిండివనం సమీపంలోని ఓ గ్రామానికి చెందిన 13 ఏళ్ల బాలిక అక్కడి ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. సామాజిక మాధ్యమాల ద్వారా అదే ప్రాంతానికి చెందిన నలుగురు యువకులతో పరిచయం ఏర్పడింది. యువకులు బాలికకు మాయమాటలు చెప్పి ఒక్కొక్కరుగా అత్యాచారానికి పాల్పడుతూ వచ్చారు. ఈనెల 14న సాయంత్రం బాలిక ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. తల్లిదండ్రుల, బంధువులు అనేక ప్రాంతాల్లో గాలించారు. మరుసటి రోజు ఉదయం పట్టణ ప్రాంతంలో గుర్తించారు. నలుగురు యువకులు సామూహిక అత్యాచారానికి పాల్పడినట్లు బాలిక తెలిపింది. తల్లిదండ్రులు దిండివనం మహిళా పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో ఊరల్ గ్రామానికి చెందిన ధనశేఖర్ (19), అతని అన్న తిరునావుక్కరసు(20), మురళి(23), ప్రహ్లాదన్(24) అత్యాచారానికి పాల్పడినట్లు తెలిసింది. నలుగురిని పోక్సో చట్టం కింద అరెస్టు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

మతం పేరుతో దూషించిన యువకుడు...

అరక్కోణం: రాణిపేట జిల్లా వాలాజాపేట వెదలైకార వీధికి చెందిన సలావుద్దీన్ కుమారుడు మహమ్మద్ షఫీ బస్టాండు సమీపంలో సెల్‌ఫోన్ల దుకాణం నడుపుతున్నారు. ఇదిలా ఉండగా రాణిపేట సిప్కాట్ ప్రాంతానికి చెందిన విఘ్నేష్ కుమారుడు ధన్వంతన్ (22) చెన్నైలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంజినీరింగ్ నాలుగో ఏడాది చదువుతున్నాడు. మహమ్మద్ షఫీ రూ.15వేలకు సెల్‌ఫోన్ విక్రయిస్తానని 'ఓఎల్ఎక్స్' యాప్‌లో పెట్టడంతో చూసిన ధన్వంతన్ రూ.9వేలకు ఇవ్వమని అడిగాడు. ఈ విషయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో ఆగ్రహించిన ధన్వంతన్.. ఎక్కువ ధరకు సెల్‌ఫోన్‌లను విక్రయిస్తూ కొనుగోలుదారులను మోసం చేస్తున్నావని షఫీపై విరుచుకుపడ్డాడు. అతని మతాన్ని దూషిస్తూ మాట్లాడాడు. దీంతో షఫీ వాలాజాపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు జరిపిన పోలీసులు ధన్వంతన్‌ను గురువారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచి తోరపాడి జైలుకు తరలించారు.

గంజాయి కేసులో నలుగురు...

టీనగర్: సేలం ముల్లువాడి గేట్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద సుమారు రూ.లక్ష విలువచేసే గంజాయి తదితర మత్తుపదార్థాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తులో.. వారు బెంగళూరుకు చెందిన గోవిందరాజ్, లోకేష్, సేలం సెవ్వాపేటకు చెందిన జీవానందం, విఘ్నేష్‌గా తెలిసింది. వారు బెంగళూరు నుంచి మత్తుపదార్థాలను తీసుకొచ్చి సేలంలోని పాఠశాల విద్యార్థులకు విక్రయిస్తున్నట్లు తేలడంతో అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

భారీగా ఆవిన్ పాల కొనుగోలు

టీనగర్: చెన్నై నగరానికి రెడ్ అలర్ట్ ప్రకటించిన నేపథ్యంలో బుధవారం ఒక్క రోజే 16.50 లక్షల లీటర్ల పాలను విక్రయించినట్లు ఆవిన్ యంత్రాంగం ప్రకటించింది. సంస్థ గురువారం విడుదల చేసిన ప్రకటనలో.. భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం ముందుగానే హెచ్చరించడంతో వినియోగదారులకు ఎక్కడా కొరత లేకుండా చెన్నై, పరిసరాల్లోని అనేక ప్రాంతాల్లో ఆవిన్ పాలను భారీగా అందుబాటులో పెట్టినట్లు తెలిపింది. దీంతో వినియోగదారులు ముందు జాగ్రత్తతో పాలను అదనంగా కొనుగోలు చేశారని, దీంతో రోజువారీగా 14.50 లక్షల లీటర్ల వంతున అమ్ముడవుతున్న ఆవిన్ పాలు బుధవారం అదనంగా రెండు లక్షల లీటర్లు విక్రయమైనట్లు పేర్కొంది